

కదిలింది కరుణరథం



గుణదల కొండ దిగువ నుంచి శిఖరాగ్రాన శిలువ మార్గం వరకు భక్తుల యాత్ర (ఇన్‌సెట్‌లో) నాగాయలంక సెంటర్‌లో విశ్వాసుల ర్యాలీ

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు శిలువయాత్రలు నిర్వహించారు. శిలువను మోస్తూ క్రీస్తు వేషధారి ముందుకు సాగగా, భక్తులు ర్యాలీగా అనుసరించారు. అంతకుముందు ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తుకు క్షమా స్వాగతం పలికారు.

● అందాల కీర్తి



ఆర్‌ఎస్ బ్రదర్స్ రెండో అతిపెద్ద షోరూమ్ శుక్రవారం విజయవాడలో ప్రారంభమైంది. బీసెంట్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన ఈ షోరూమ్‌ను మహానటి ఫేమ్ కీర్తి సురేశ్ ప్రారంభించారు. ఆమెను చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అమరావతి శంకుస్థాపనకు ఏర్పాట్లు

ప్రధానీ మోదీ పర్యటనకు సన్నాహాలు

- సభాస్థలి పనులు ప్రారంభం
- అందంగా సీడ్ యాక్సెస్ రోడ్డు



6లో

రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి కృష్ణాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. పదిమంది మృతి

ఉమ్మడి కృష్ణాజిల్లా రహదారులు శుక్రవారం రక్తసిక్తమయ్యాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 10 మంది మృతిచెందారు. ఒక్క జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం నలుగురు కన్నుమూయడం విషాదకరం. క్రైస్తవ శ్రమదీక్ష తీసుకుని కాలినడకన గుణదల బయల్దేరిన ఇద్దరు భక్తులను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఇక ప్రసాదంపాడులో లారీ బీభత్సం సృష్టించగా, డ్రైవర్‌తో పాటు పాదచారి మృతిచెందారు. ఘటనాస్థలాల్లో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు కాగా, స్వగ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

\- విజయవాడ, ఆంధ్రజ్యోతి





ప్రసాదంపాడులో బీభత్సం సృష్టించిన లారీ ఇదే.. (ఇన్‌సెట్‌లో) పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్న యాక్టివా వాహనం

ఒక్క జగ్గయ్యపేటలోనే మూడు ప్రమాదాలు

- ప్రసాదంపాడులో డ్రైవర్‌కు గుండెపోటు.. లారీ బీభత్సం
- పాదచారిపైకి దూసుకెళ్లిన లారీ.. అక్కడికక్కడే మృతి
- గుణదలకు కాలినడకన బయల్దేరిన ఇద్దరు భక్తులు
- మార్గంమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం
- ఆటో ప్రయాణికులను కాపాడి వాహన డ్రైవర్ కన్నుమూత
- స్వగ్రామాల్లో మిన్నంటిన రోదనలు



ప్రసాదంపాడులో మృతిచెందిన రామకృష్ణ, రామసాయి (ఫైల్), జగ్గయ్యపేటలో వాహనం ఢీకొని మృతిచెందిన వెంకటేశ్వర్లు, భాస్కరరావు (ఫైల్), తిరుమలగిరి ప్రమాదంలో మృతిచెందిన హైదరాబాద్‌వాసి ప్రవీణ్, పాపవినాశనం ప్రమాదంలో మృతుడు వెంకటేశ్వరరావు (ఫైల్)

ప్రసాదంపాడులో లారీ బీభత్సం

లారీడ్రైవర్‌కు గుండెపోటు.. పాదచారి మృతి

విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని జాతీయ రహదారిపై మృత్యువు వేర్వేరు రూపాల్లో ఇద్దరిని బలి తీసుకుంది. డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో లారీ బీభత్సం సృష్టించింది. గుండెపోటుతో లారీడ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఓ పాదచారుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. పామర్రు మండలం నిమ్మకూరుకు చెందిన జంపాని రామకృష్ణ (54) లారీ డ్రైవర్. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ నుంచి ఫ్లైయాష్ లోడుతో లారీ గన్నవరం వైపు వెళ్తోంది. ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి వచ్చిన రామకృష్ణకు ఇన్నోటెల్ హోటల్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. అక్కడి నుంచి లారీని అదుపు చేసుకుంటూ ప్రసాదంపాడులోని ఉప్పలబజారు వద్దకు వచ్చాడు. నొప్పి ఎక్కువ కావడంతో నియంత్రణ కోల్పోయాడు. దీంతో లారీ బీభత్సం సృష్టించింది. రహదారిపై అటూ ఇటూ తిరుగుతూ వాహనదారులు, పాదచారులను భయపెట్టింది. ముందుగా రోడ్డు డివైడర్‌ను, ఆ తర్వాత పార్క్ చేసిన కారు, బైక్‌ను ఢీకొంది. అనంతరం ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న రామవరప్పాడుకు చెందిన బలుగూరి రామసాయి (18)ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని ట్రాఫిక్ పోలీసులు అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రామసాయి ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు నిర్ధారించారు. రామవరప్పాడుకు చెందిన రామసాయి ఆటోనగర్‌లో వెల్డింగ్ పనిచేస్తుంటాడు. టీ తాగడానికి ప్రధాన రహదారిపైకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రసాదంపాడుకు చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తూ.. బల్లెం వారి వీధి వద్ద కూల్‌డ్రింక్ తాగుదామని రోడ్డు పక్కన ఆగారు. వాహనాన్ని ఫుట్‌పాత్ వద్ద నిలిపి షాపు వద్దకు వెళ్లారు. ఇంతలో లారీ దూసుకొచ్చింది. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

క్రీస్తు శ్రమదీక్షలో దారుణం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం

గుడ్‌ఫ్రైడే సందర్భంగా శ్రమదీక్ష విరమించడానికి గుణదలకు బయల్దేరిన ఇద్దరిని గుర్తుతెలియని వాహనం బలి తీసుకుంది. జగ్గయ్యపేట మండలం వేదాద్రికి చెందిన పసుమర్తి భాస్కరరావు (48), మిగతా 6లో..

కిడ్నీ వ్యాధితో బాలిక మృతి

ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినికి కిడ్నీలు ఫెయిల్

గంపలగూడెం మండలం గోసవీడులో విషాదం



అశ్విత (ఫైల్)

గంపలగూడెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధికి ఓ చిన్నారి బలైంది. గోసవీడు దళితవాడకు చెందిన పల్లెకంటి నాగరాజు రెండో కుమార్తె అశ్విత (13)కు ఆరేళ్లకే ముఖం వాచిపోవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. అయితే, డాక్టర్లు థైరాయిడ్‌గా నిర్ధారించారు. థైరాయిడ్ మందులు వాడుతున్నా బాలిక అనారోగ్యంగా ఉండటంతో విజయవాడలో వైద్యం చేయించారు. కాగా, నాలుగు నెలల క్రితం మంగళగిరిలోని ఎయిమ్స్‌లో డాక్టర్లు పరీక్షలు చేసి కిడ్నీలు ఫెయిల్ అయినట్లు నిర్ధారించి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అప్పటి నుంచి జీజీహెచ్‌లో డయాలసిస్ చేయిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. శుక్రవారం మరోసారి బాలికను జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించింది. బాలిక తోటమూలలోని ఓ స్కూల్లో ఆరో తరగతి చదువుతోంది. తండ్రి నాగరాజు తాపీ పని చేసుకుంటూ జీవిస్తుంటాడు. బాలిక మృతితో దళితవాడలో విషాదఛాయలు అలముకున్నాయి.

గోనె సంచులు ఇవ్వండి

- రోజుల తరబడి కల్లాల్లో ధాన్యాన్ని కాపాడుకోలేకపోతున్నాం
- రాజుగూడెం సొసైటీ వద్ద రైతుల ఆందోళన

6లో

శిథిలావస్థలో..

భయంకరంగా బందరు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సులు

- పెచ్చులూడుతున్న శ్లాబులు, మొండిగోడలు
- రంగులు వేసి ఎనిమిదేళ్లు అయినా పట్టని అధికారులు
- బిక్కుబిక్కుమంటున్న షాపుల అద్దెదారులు
- కోనేరు సెంటర్ కాంప్లెక్స్ పరిస్థితి మరీ దారుణం
- అద్దె పెంచుతున్నా అభివృద్ధి చేయని అధికారులు

ఎప్పుడు కూలిపోతాయో తెలియని షాపులు.. పెచ్చులూడుతున్న శ్లాబులు.. కనిపించని కనీస మౌలిక సదుపాయాలు.. మచిలీపట్నంలోని నగరపాలక సంస్థ షాపుల దుస్థితి ఇది. ఏడాదికి రూ.కోటికి పైగా ఆదాయం వచ్చే ఈ షాపులపై అధికారులు శీతకన్ను వేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. బయటకు వెళ్లలేక, ఉన్న షాపుల్లో వ్యాపారం చేయలేక అద్దెదారులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

మచిలీపట్నం టౌన్, ఆంధ్రజ్యోతి : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని షాపులు శిథిలమై ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. కోనేరు సెంటర్‌లో 40 ఏళ్ల క్రితం నిర్మించిన షాపులు, పార్కు పక్కన నిర్మించిన షాపుల్లో పరిస్థితి దారుణంగా ఉంది. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. కొన్ని షాపుల పైకప్పులు పూర్తిగా శిథిలం కావడంతో అద్దెదారులు వాటిని మూసివేశారు. షాపులు తమ పేరున ఉండేందుకు అద్దె మాత్రం చెల్లిస్తున్నారు. వీటికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవట్లేదు.



మునిసిపల్ పార్కు వద్ద కాంప్లెక్స్‌లో కూలిపోతున్న పైకప్పు పడిపోకుండా కర్రలు అడ్డుపెట్టిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) కోనేరు సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ పైకప్పు దుస్థితి

దాదాపు అన్ని షాపులదీ అదే పరిస్థితి

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో 390 షాపులు ఉన్నాయి. కోనేరు సెంటర్‌లోని పట్టాభి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఇతర కాంప్లెక్స్‌ల్లో 200 వరకు షాపులు ఉన్నాయి. పార్కు పక్కన ఉన్న సన్నాల వేణుగోపాలరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో 10, జిల్లా కోర్టులోని షాపింగ్ కాంప్లెక్స్‌లో 24, నెహ్రూ షాపింగ్ కాంప్లెక్స్‌లో 10, బేబీ సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో 24, నారకోట్ల సెంటర్‌లో 15, కూరగాయల మార్కెట్‌లో 20 ఉన్నాయి. ఇలా వివిధ ప్రాంతాల్లో చిన్నచిన్న షాపులు ఉన్నాయి. మొత్తం 390 షాపులకు అద్దెల కింద ఏడాదికి రూ.కోటి 25 లక్షల ఆదాయ వస్తుంది. కాగా, పదేళ్ల కిందట రోడ్డు విస్తరణలో తొలగించిన షాపులు మొండిగోడలతో అలాగే ఉండిపోయాయి. కోనేరు సెంటర్‌లోని షాపులకు చుట్టుపక్కల 20 గ్రామాలకు చెందిన వినియోగదారులు వస్తుంటారు. ఇక్కడ ఏళ్ల తరబడి నగల వ్యాపారం జరుగుతోంది.

ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేస్తున్నా..

కోనేరు సెంటర్‌లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేయాలని చిత్తజల్లు సాయిప్రసాద్ అనే ఓ షాపు అద్దెదారు ఇటీవల మునిసిపల్ అధికారులను కోరారు. ఏడాదికి 10 శాతం అద్దె పెంచుతున్నా కనీస మౌలిక సదుపాయాలు కల్పించట్లేదని ఆయన పేర్కొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో పైకప్పు కూలిపోతోందని, భయం గుప్పెట్లో వ్యాపారాలు చేసుకుంటున్నామని మిగతా 6లో..

రాజీనా.. రాజీనామానా..?

- పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తామని వైసీపీ కౌన్సిలర్ల అల్టిమేటం

తిరువూరులో మళ్లీ రచ్చకెక్కిన చైర్‌పర్సన్ వివాదం

- రాజీనామా ఆమోదం సమయానికి చైర్‌పర్సన్‌కు అస్వస్థత
- కౌన్సిల్ సమావేశం నుంచి ఆసుపత్రికి..
- ఆగ్రహంగా ఉన్న వైసీపీ అసమ్మతివాదులు
- రాజీనామా చేయడానికి సన్నాహాలు
- బుధవారం వరకూ ఆగాలని స్థానిక నాయకుల బుజ్జగింపు



గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం మధ్యలోనే వెళ్లిపోతున్న చైర్‌పర్సన్

తిరువూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మునిసిపల్ చైర్‌పర్సన్ రాజీనామా అంశం నాటకీయ పరిణామాల మధ్య మరో గందరగోళానికి దారితీసింది. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం మధ్యలో చైర్‌పర్సన్ కస్తూరిబాయి అర్ధంతరంగా వెళ్లిపోవడం, ఆ తర్వాత అస్వస్థతకు గురికావడం, రాజీనామా ఆమోదం పొందకపోవడం.. వంటి పరిణామాలపై కొందరు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు గుర్రుగా ఉన్నారు. రాజీనామా విషయంలో తాడోపేడో తేల్చుకుంటామని, లేదంటే ముకుమ్మడిగా తమ పదవులు, పార్టీకి రాజీనామా చేస్తామని వారంతా అల్టిమేటం జారీ చేయడంతో అధిష్ఠానం ఈ సమస్య పరిష్కారంపై మల్లగుల్లాలు పడుతోంది.

ఆది నుంచీ వివాదమే..

తిరువూరు మునిసిపాలిటీకి చెందిన 20 వార్డుల్లో 17 వార్డులు గెలుచుకున్న వైసీపీ.. చైర్‌పర్సన్ నియామకంలో తొలి నుంచి వివాదాలు ఎదుర్కొంటోంది. మొదట్లో చైర్‌పర్సన్‌గా మోదుగు ప్రసాద్ పేరును అప్పటి మిగతా 6లో..

టీడీపీ కార్యాలయంపై రాళ్లదాడి

- నందిగామలో కలకలం

6లో



మూలపాడులో అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీల ప్రారంభం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

దేశానికి క్రీడా రాజధానిగా అమరావతి

● సీఎం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి చెందుతుందని ఎంపీ కేశినేని చిన్ని ఆశాభావం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం క్రీడాంధ్రప్రదేశ్ కావడంతో పాటు రాజధాని అమరావతి ప్రాంతం దేశానికే క్రీడా రాజధానిగా అభివృద్ధి చెందుతుందని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మూలపాడులో ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించే అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీలను శుక్రవారం శాప్ ఛైర్మన్ రవి నాయుడితో కలిసి ఆయన ప్రారంభించారు. కేశినేని ఫౌండేషన్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, శాప్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పది టీమ్‌లు తలపడుతున్నాయి. టోర్నమెంట్‌ను ఎంపీ ప్రారంభించారు. జాతీయ పోటీల నిర్వహణకు రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఏపీకి ఐపీఎల్ టీమ్ కూడా ఏర్పాటు కానుందని స్పష్టం చేశారు. మూలపాడు ప్రాంతంలోనే స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నెలకొల్పేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని, అత్యుత్తమ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అభివృద్ధికి ఐసీసీ ఛైర్మన్ జైషా హామీ ఇచ్చారని తెలిపారు. సెలవుల్లో 5 లక్షల మంది పిల్లలకు వేసవి శిక్షణ ఇప్పిస్తున్నట్లు శాప్ ఛైర్మన్ రవి నాయుడు తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండమూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తలపడిన జట్లు..

మూలపాడులోని ఏసీఏ స్టేడియంలోని ఏ గ్రౌండ్‌లో ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఐ అండ్ పీఆర్ టీమ్‌పై విజయవాడ మీడియా టీం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐ అండ్ పీఆర్ టీం 89 పరుగులకు ఆలౌట్ కాగా, విజయవాడ మీడియా జట్టు మూడు వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. బీ గ్రౌండ్‌లో సచివాలయం ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ టీవీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేబుల్ టీవీ జట్టు గెలుపొందింది. మధ్యాహ్నం ఏ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సచివాలయం ప్రింట్ మీడియా టీమ్‌పై అమరావతి మీడియా జట్టు విజయం సాధించింది.

రాజధాని మీడియా జట్టు ఘన విజయం

బీ గ్రౌండ్‌లో మధ్యాహ్నం సచివాలయం కెమెరామెన్ జట్టు, రాజధాని మీడియా జట్టు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన రాజధాని మీడియా జట్టు ఏడు వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సచివాలయం కెమెరామెన్ జట్టు 51 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ మ్యాచ్‌లో రాజధాని మీడియా జట్టు 105 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

ఆర్థిక నేరాల్లో రాజకీయ నేతల హస్తం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఆరోపణ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకుల్లో జరుగుతున్న ఆర్థిక నేరాలు, ఎగవేతల్లో ఎక్కువగా రాజకీయ పార్టీ నేతల హస్తం ఉంటోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ముఖ్య నేతల సమావేశం శుక్రవారం లెనిన్ సెంటర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం వజ్రోత్సవ సమావేశాల నిర్వహణపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. సహకార బ్యాంకులు సొసైటీల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని, సహకార ఉద్యమ లక్ష్యాలు నెరవేర్చాలని అన్నారు. అన్ని సంఘాలు ఒకే తాటిమీదకు వచ్చి వజ్రోత్సవ సమావేశాలు నిర్వహించుకోవడం శుభపరిణామమన్నారు. ఐక్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కరించుకోవచ్చని, రెండంచెల విధానం వల్ల రైతులకు రుణభారం తగ్గుతుందని అన్నారు. దీని కోసం ముఖ్యమంత్రిని కలిసి అమలు అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కార్మిక, ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు సృష్టించే శక్తుల కుట్రలను ఎండగట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు కోరారు. ఫెడరేషన్ ఛైర్మన్ వెలుగురి రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి రవికుమార్, సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని రాజా, ప్రతినిధులు కిషోర్, ఏఐటియూ నేతలు ఆర్.రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జి.గోపిని శుక్రవారం ఎస్పీ ఆర్.గంగాధరరావు జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించే దిశగా న్యాయ, భద్రత వ్యవస్థలు పరస్పరం సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని ఇరువురు ఆకాంక్షించారు. బందరు డీఎస్పీ సీహెచ్ రాజా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, చిలకలపూడి సీఐ నబీ పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపిని కలిసి మొక్క అందజేస్తున్న ఎస్పీ గంగాధరరావు

విజయవాడలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయాలి

● ప్రభుత్వానికి యూటీఎఫ్ వినతి

విజయవాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, దివ్యాంగులను గుర్తించడానికి బందరులో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంపై పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) ఎన్టీఆర్ జిల్లాశాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 24, 25, 26 తేదీలలో నిర్వహించబోయే మెడికల్ క్యాంపును బందరుతో పాటు విజయవాడలో కూడా ఏర్పాటుచేయాలని కోరింది. ఉపాధ్యాయ బదిలీలు 1998 నుంచి జరుగున్నప్పటి నుంచి విజయవాడలో కూడా మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి క్యాంపులు జరుపుతున్నారన్నారని తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జిల్లా వ్యాప్తంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, దివ్యాంగులను తెచ్చుకోవడానికి ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తమ విన్నపాన్ని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లి విజయవాడలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ శాఖ కోరింది.

21న దుర్గగుడి హుండీ కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 21వ తేదీన హుండీలను తెరిచి కానుకలను లెక్కిస్తామని ఈవో కె.రామచంద్ర మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7.30 గంటల నుంచి మల్లేశ్వర మహామండపం 6వ అంతస్థులో లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సేవా బృందం సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

గోనె సంచులు ఇవ్వండి

రోజుల తరబడి కల్లాల్లో ధాన్యాన్ని కాపాడుకోలేకపోతున్నాం

రాజుగూడెం సొసైటీ వద్ద రైతుల ఆందోళన

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): ధాన్యాన్ని మిల్లులకు తోలేందుకు గోనెసంచులు ఇవ్వాలంటూ శుక్రవారం రైతులు రాజుగూడెం సొసైటీ వద్ద ఆందోళనకు దిగారు. మండలంలోని వావిలాల శివారు రాజుగూడెం పీఏసీఎస్ పరిధిలోని వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం పంచాయతీల్లో మూడువేల ఎకరాల్లో వరి కోతలు పూర్తవడంతో ధాన్యం కల్లాల్లో ఎండబెట్టిన రైతులు ధాన్యం అమ్మేందుకు సంచులకోసం సొసైటీ చుట్టూ తిరుగుతున్నారు. సిబ్బంది పట్టించుకోకపోవడంతో, కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. సొసైటీకి వస్తున్న సంచులను కొందరు పెద్దలు మధ్యలోనే ఇళ్లకు తరలిస్తున్నారని, ముందుగా ధాన్యం కోసిన వారికి సంచులు అందించకుండా, వరికోతలు చేపట్టని వారికి సొసైటీ నుంచి సంచులు అందిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి కల్లాలో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడలేకపోతున్నామని, వర్షం కురిసి తడిసి దెబ్బతింటుందని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



రాజుగూడెం సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సంచులు సత్వరమే అందిస్తాం: ఆర్డీవో మాధురి

డివిజన్ పరిధిలో రైతులకు అవసరమైన గోనె సంచులు సత్వరమే అందిస్తామని ఆర్డీవో మాధురి తెలి పారు. రాజుగూడెం సొసైటీ పరిధిలోని రైతులు ధాన్యం సంచులు అందక పడుతున్న ఇబ్బందుల్ని ఆర్డీవో దృష్టికి ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ తీసుకెళ్లారు. దీంతో ఆర్డీవో స్పందించి సొసైటీకి అవసరమైన సంచులు అందిస్తామని, అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

20 రోజుల నుంచి కల్లాల్లోనే ధాన్యం

వరికోతలు పూర్తిచేసి 20 రోజులయింది. సొసైటీ చుట్టూ సంచులకోసం తిరుగుతున్నాం. గతంలో దిగుమతి చేసిన సంచులు ఎవరికి ఇచ్చారో తెలియదు. సొసైటీకి సంచులు వస్తున్నా సన్న, చిన్నకారు రైతులకు అందడం లేదు.

- కొమ్మినేని కోటేశ్వరరావు, రైతు, రాజుగూడెం

వర్షం వస్తే తీవ్రంగా నష్టపోతాం

సొసైటీకి కావాల్సిన సంచులు అందేలా అధికారులు చూడాలి. కోసిన ధాన్యాన్ని కల్లాల్లో, ఖాళీ స్థలాల్లో ఎండబెట్టాం. అకాలవర్షం వస్తే తీవ్రంగా నష్టపోతాం.

- కొమ్మినేని వీరయ్య, రైతు, రాజుగూడెం

కోతలు పూర్తిచేసిన రైతులకే సంచులు


ఈ క్రాప్ బుకింగ్ అయ్యి వరి కోతలు పూర్తిచేసిన రైతులకే సంచులు అందిస్తున్నాం. కొందరు రైతులు తమ సొంతవాహనాల్లో మిల్లుల నుంచి సంచులు తెచ్చుకుంటున్నారు. ఇప్పటి వరకు 25, 600 సంచులు అందించాం. సంచుల కోసం నివేదిక అందించాం, వస్తున్నాయి.

-సూర్యారావు, రాజుగూడెం సొసైటీ సీఈవో

టీడీపీ కార్యాలయంపై రాళ్లదాడి

నందిగామ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నందిగామలోని రైతుపేట టీడీపీ కార్యాలయంపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లదాడి చేశారు. దీంతో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సీఐ లచ్చునాయుడు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఆకతాయిల పనా.. లేక రాజకీయ కోణంలో జరిగిందా అని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.





కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఐ లచ్చునాయుడు, పగిలిన కిటికీ అద్దాలు





మెట్లపై పొర్లు దండాలు పెడుతూ ఇంద్రకీలాద్రిపైకి వెళుతున్న నార్ల ఈశ్వర్

పవన్ అభిమాని సోపాన సేవ

● మార్క్ శంకర్ కోలుకోవడంతో మెట్లపై పొర్లుదండాలు పెడుతూ కొండపైకి వెళ్లి దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ కోలుకోవడంతో పవన్ అభిమాని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు మొక్కు తీర్చుకున్నారు. మార్క్ శంకర్ ఆరోగ్యం బాగుంటే మెట్ల(సోపాన సేవ) ద్వారా పొర్లుకుంటూ వచ్చి దర్శనం చేసుకుంటానని తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండలానికి చెందిన నార్ల ఈశ్వర్ మొక్కుకుని అమ్మవారి దీక్ష తీసుకున్నారు. తాజాగా మార్క్ శంకర్ కోలుకోవడంతో శుక్రవారం ఇంద్రకీలాద్రికి కుటుంబ సభ్యులతో వచ్చి మెట్ల మార్గం గుండా ఒక్కొక్క మెట్టుకు నమస్కారం చేసుకుంటూ పొర్లు దండాలు పెట్టుకుంటూ కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నాడు. మెగా కుటుంబానికి తాను వీరాభిమానినని, ఇప్పటికే 23సార్లు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించానని ఈశ్వర్ తెలిపారు. వారిలో ఎవరికి ఏ కష్టం కలిగినా తన మనస్సు కలచివేస్తుందని, వెంటనే భగవంతుని వద్దకు వెళ్లి వారికి క్షేమం కలగాలని కోరుకుంటానని తెలిపారు.

విద్యుత్‌శాఖ ద్వారా వేతనాలు చెల్లించండి

గుణదల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఉన్న దళారీ వ్యవస్థను రద్దు చేయాలని, విద్యుత్‌శాఖ ద్వారా వేతనాలు చెల్లించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఏపీ విద్యుత్‌శాఖ కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి పుట్లూరి నాగార్జున కోరారు. నగర పర్యటనకు వచ్చిన మంత్రిని శుక్రవారం సంఘం నేతలు కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 26వేల మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. సంస్థనే నమ్ముకుని పనిచేస్తున్న వారికి వైద్య సదుపాయాలు, పదవీ విరమణ చేసే వారికి టెర్మినల్ బెనిఫిట్స్ లభించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పలు చోట్ల వాచ్‌మెన్లు లేకుండా ఆపరేటర్లు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారని ఇది చాలా ఇబ్బందిగా ఉందన్నారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యుత్‌శాఖ కాంట్రాక్టు కార్మిక సంఘం నేతలు

డీఎస్సీ జనరల్ అభ్యర్థులకు వయోపరిమితి 47ఏళ్లకు పెంచాలి

● ప్రభుత్వానికి ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్ విజ్ఞప్తి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రభుత్వం విడుదల చేసే డీఎస్సీ నోటిఫికేషన్‌లో జనరల్ అభ్యర్థులకు వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ప్రభుత్వానికి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వీరి వయోపరిమితి 44 ఏళ్లుగా ఉందని పేర్కొన్నారు. వయస్సు కటాఫ్ డేట్‌ను 2024 జూల్ 1వ తేదీగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో డీఎస్సీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగుల వయోపరిమితి పెరిగిందని పేర్కొన్నారు. ఈ కటాఫ్ డేట్ వల్ల ఎంతో మంది నిరుద్యోగులకు మేలు చేకూరుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో డీఎస్సీ రద్దుకారణంగా అభ్యర్థులు చెల్లించిన పరీక్ష రుసుంను ఈ డీఎస్సీకి చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ఒకే రోజు నిర్వహించాలని, ఇలా చేయడం వల్ల వివిధ రకాల ప్రశ్నపత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని సూచించారు. అలాచేయని పక్షంలో కొంతమందికి కష్టమైన, మరికొంతమందికి సులభతరమైన ప్రశ్నపత్రాలు వచ్చి ర్యాంక్‌లో తేడా వచ్చే అవకాశం ఉందని హేమంత్ కుమార్ పేర్కొన్నారు.

చేనేత, హస్తకళ రంగాల అభివృద్ధే లక్ష్యం

● హస్తకళ అభివృద్ధి సలహాదారు సుచిత్ర ఎల్ల

విజయవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చేనేత, హస్తకళ రంగాల అభివృద్ధే ధ్యేయమని సుచిత్ర ఎల్ల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లను చేనేత, హస్తకళ అభివృద్ధి సలహాదారుగా నియమించిన సందర్భంగా శుక్రవారం ఆప్కో భవన్‌లో అధికారికంగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. చేనేత, హస్తకళ రంగాలకు మూలమైన పాలసీ మార్పులపై సలహా, సుస్థిర అభివృద్ధి, మార్కెట్‌ను పెంచడం, డిజిటల్ వేదికలు, బయోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపులపై దృష్టి సారిస్తానని సుచిత్ర ఎల్ల పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో సుచిత్ర ఎల్లకు ఉన్న అనుభవం, నాయకత్వ లక్షణాలు చేనేత రంగ అభివృద్ధికి దోహదపడుతుందని చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖా రాణి అన్నారు. చేనేత, హస్తకళా రంగాల బలోపేతానికి కృషి చేయాలని సుచిత్ర ఎల్లను ఆమె కోరారు. ఆప్కో అధికారులు నాగేశ్వరరావు, కన్నబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి శంకుస్థాపనకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పునర్నిర్మాణ పనులకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే 2వ తేదీ జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనుక భాగంలోని సభాస్థలి ప్రాంగణంలో పనులు ఇప్పటికే మొదలయ్యాయి. భారీ టెంట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల కోసం ఒక టెంట్ ఆఫీసును సిద్ధం చేశారు. సభాస్థలిలో గ్యాలరీల భాగాన్ని భారీ ఎత్తున యంత్రాలు, రోడ్డు రోలర్లతో చదును చేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది రానుండటంతో భారీ గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. అలాగే, రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలను, మట్టి కుప్పలను తొలగిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రీన్‌బెల్టుల్లో భారీగా లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పూల మొక్కలు నాటుతున్నారు. విద్యుత్ స్తంభాలకు రంగురంగుల ఎల్ఈడీ దీపాలను అమర్చారు. ఇక సభాస్థలిని కొండపల్లి బొమ్మలతో అందంగా అలంకరించనున్నారు.

చలపతి, విజయవర్ధనరావుల విడుదలపై హైకోర్టు తీర్పును అమలుచేయాలి

● జీవిత ఖైదీల విడుదల సాధన కమిటీ విజ్ఞప్తి

● నేడు న్యాయవాదులతో విజయవాడలో సమావేశం

విజయవాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బస్సు దహనం ఘటనలో జీవిత ఖైదు అనుభవిస్తున్న చలపతిరావు, విజయవర్ధనరావుల విడుదల విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జీవిత ఖైదీల విడుదల సాధన కమిటీ కన్వీనర్ ఆర్.భరద్వాజ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వారిద్దరి విడుదలకు సంబంధించిన చట్టపర అంశాలను పరిశీలించాలని ఈ నెల తొమ్మిదిన హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయితే, వారం ముందే సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలతో రాష్ట్ర ప్రభుత్వం జీవో 71 విడుదల చేయడంతో కోర్టు తీర్పు అమలుకాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అందువల్ల జీవో 71ను కోర్టు ఆదేశాలనుగుణంగా సవరించి వారిద్దరి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు. సమస్యపై న్యాయవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

భోగవల్లి శ్రీధర్ మృతి బీజేపీకి తీరనిలోటు

చిట్టినగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న భోగవల్లి శ్రీధర్ అకాల మరణం పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నూకల మధుకర్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. సిండికేట్ కాలనీలో శుక్రవారం శ్రీధర్ భౌతికకాయానికి వారు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీధర్ గురువారం మృతి చెందారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పోతిన బేసి కంతేశ్వరుడు, పట్నాయక్, పైలా సురేష్ ఉన్నారు.



శ్రీధర్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

రాజీనా..రాజీనామానా..?

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే ప్రతిపాదించగా, అధిష్ఠానం కస్తూరిభాయిని ఖరారు చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత రాజీనామా చేయాలని, మరొకరికి అవకాశం కల్పించాలని అప్పటి ఎమ్మెల్యే ఆదేశించారు. నాటి నుంచి వైసీపీ కౌన్సిలర్లలో విభేదాలు మొదలయ్యాయి. రెండేళ్ల తర్వాత ఆమె రాజీనామా చేయకపోవడంతో కొందరు వైసీపీ కౌన్సిలర్లు సహాయ నిరాకరణ చెపట్టారు. అధిష్ఠానం కూడా పట్టించుకోకపోవడంతో వివాదం ముదిరింది. పాలన నాలుగేళ్లు పూర్తవడంతో అసమ్మతి కౌన్సిలర్లు, కలెక్టర్, ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్‌కు అవిశ్వాసం నోటీసు అందించారు. వివాదం తీవ్రం కావడంతో అధిష్ఠానం అసమ్మతివాదుల్ని బుజ్జగించే ప్రయత్నం చేసింది. దీంతో గతనెల 3న కస్తూరిబాయి రాజీనామా సమర్పించారు. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ రాజీనామా ఆమోదించాల్సి ఉంది. అయితే, సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ఆమె అస్వస్థతకు గురయ్యారు. సమావేశం మధ్యలోనే ఆసుపత్రికి వెళ్లిపోయారు. దీంతో సమావేశం వాయిదా పడటంతో, వైసీపీ అమ్మతి కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వైసీపీ నాయకులను కలిశారు. సమస్యను పరిష్కరించకుంటే, పార్టీకి, పదవులకు రాజీనామా చేసి, సొంత పనులు చేసుకుంటామని కౌన్సిలర్లతో పాటు పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు తెగేసి చెప్పారు. బుధవారం వరకు ఓపిక పట్టాలని, అన్ని సమస్యలు సర్దుకుంటాయని నాయకులు అసమ్మతి వాదుల్ని బుజ్జగించినట్లు తెలుస్తోంది. ఛైర్‌పర్సన్ రాజీనామాను ఆమోదిస్తే, బోర్డుకు ఉన్న 10 నెలల కాలంలో నూతన ఛైర్‌పర్సన్ ఎన్నుకునే అవకాశం ఉంటుందా, లేదా అనుమానాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో..

(5వ పేజీ తరువాయి)

సన్నాల వేణుగోపాలరావు, ఇతర టైలర్లు అధికారులకు విన్నవించారు. అయినా మునిసిపల్ అధికారులు పట్టించుకోవట్లేదు. కోనేరు సెంటర్‌లోని షాపుల వ్యాపారులకు కనీసం మరుగుదొడ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. షాపులు ఖాళీ చేయాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు వ్యాపారులకు చెప్పినప్పటికీ.. బతుకు తెరువు కోసం అలాగే భయంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

పీ4 కింద కోనేరు సెంటర్‌ను అభివృద్ధి చేస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

కోనేరు సెంటర్‌లోని షాపుల సమస్యను అక్కడి వ్యాపారులు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 కార్యక్రమం కింద కోనేరు సెంటర్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా షాపులు నిర్మించిన తరువాత ప్రస్తుతం వ్యాపారాలు చేసుకుంటున్న వారికి అవకాశం కల్పిస్తామన్నారు.

రహదారులు రక్తసిక్తం

(5వ పేజీ తరువాయి)

రుద్రపోగు వెంకటేశ్వర్లు (39) ఏసుక్రీస్తు మాల వేసుకుని శ్రమదీక్ష ప్రారంభించారు. ఇద్దరూ కూలీలు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా గుణదల మేరీమాత ఆలయంలో ఇరుముడి సమర్పించడానికి గురువారం రాత్రి వేదాద్రి నుంచి కాలినడకన బయల్దేరారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో నందిగామ రూరల్ మండలం అనాసాగరం ఫ్లైఓవర్ మీద 65వ నెంబరు జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. భాస్కరరావుకు భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, మరో ముగ్గురు చదువుకుంటున్నారు. వెంకటేశ్వర్లుకు భార్య లక్ష్మీతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆగిన లారీ ఢీకొని హైదరాబాద్‌వాసి..

జగ్గయ్యపేటలోని జాతీయ రహదారిపై తిరుమలగిరి క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన ధర్మేజు ప్రవీణ్‌కుమార్ (35) అక్కడికక్కడే మృతిచెందాడు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్‌లు పనిమీద హైదరాబాద్ నుంచి కారులో విజయవాడ వస్తుండగా, జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆటో ప్రయాణికులను కాపాడి..

జగ్గయ్యపేటలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన రాజు (43) ఎస్‌ఆర్‌ఎంటీ ట్రాన్స్‌పోర్టు వాహనం డ్రైవర్‌గా 15 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. జగ్గయ్యపేటలోని కార్యాలయంలో పనిచూసుకుని విజయవాడకు వెళ్తుండగా, ముందు వెళ్తున్న కారు టైర్ పంక్చరై డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా తిరిగింది. దాని వెనుక ఉన్న ఆటోను ఢీ కొట్టకుండా ఉండేలా రాజు లారీ ఒక్కసారిగా పక్కకు తప్పించాడు. ఈ క్రమంలో లారీ పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న రూపన పుల్లయ్య, శివరాత్రి వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ రాజు అక్కడికక్కడే చనిపోయాడు.

డివైడర్‌ను ఢీ కొట్టి భవన నిర్మాణ కార్మికుడు..

పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై అడ్డాడ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పామర్రుకు చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావు (58) భవన నిర్మాణ కార్మికుడు. యాక్టివా మోటరు సైకిల్‌పై గుడివాడ వైపు వెళ్తుండగా, రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాసరావు రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై ప్రాణాలు వదిలాడు.

కారు ఢీకొని బైకర్..

తేలప్రోలు నుంచి హనుమాన్ జంక్షన్‌కు వెళ్లే జాతీయ రహదారికి ఎడమ వైపు ఉన్న సర్వీసు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ ఫక్రుద్దీన్ బాబా (51) మృతిచెందాడు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన బాబా తేలప్రోలు పట్టు రీలింగ్ కేంద్రంలో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది.

చెట్టును బలంగా ఢీకొని..

ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ సమీపంలోని కరకట్టపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోగినేనిపాలెం గ్రామానికి చెందిన దాసి వెంకటేశ్వరరావు (42) మృతిచెందాడు. గరికముక్కు శ్రీనుతో కలిసి వెంకటేశ్వరరావు శుక్రవారం ఉదయం విజయవాడ వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటి వస్తున్న క్రమంలో శివసిద్ధిని కుండళిని యోగాశ్రమం సమీపంలో కరకట్ట పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. శ్రీనుకు కాలు విరిగింది. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎదురుగా వెళ్తున్న వ్యక్తిని ఢీకొని బైకర్..

ముందు వెళ్తున్న పాదచారిని ఢీకొని బైకర్ మృతిచెందిన ఘటన గంపలగూడెం మండలం వినగడప గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గంధం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటి సరుకులు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా, గోపాలస్వామి కుంట వద్దకు రాగానే, ముందు నడుస్తున్న పాదచారుడు నంద్రు కృష్ణయ్యను ఢీకొట్టాడు. వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలై మృతిచెందగా, కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

నేడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

పెనమలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రైతు కూలీల హక్కుల పరిరక్షణ పోరాట యోధుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా యనమలకుదురు శివాలయం వెనుక సాయిబాబా గుడి సెంటర్‌లో ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం జరుగుతుందని టీడీపీ బీసీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ, గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన మనుమరాలు గౌతు శిరీష, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గౌడ సంఘం నాయకులు కొనకళ్ల బుల్లయ్య, వీరంకి గురుమూర్తి హాజరవుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో పీతా గోపీచంద్, శాంతి శివరాంప్రసాద్, సంగెపు రంగారావు, దాసరి జగన్మోహన్, ఈడే అంజిబాబు, వీరంకి కుటుంబరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ


స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న అరుణ

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డు లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి శుక్రవారం ఆలయ ట్రస్టీ కాకాని అరుణ బాబు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వస్త్రాలను అందజేశారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు స్వీకరించి తీర్థప్రసాదాలు అందజేశారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

విజయవాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అజిత్‌సింగ్‌నగర్ అగ్నిమాపక కేంద్ర సిబ్బంది శుక్రవారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పాతపాడులోని రాయల్ ఇండియన్ గ్యాస్ గౌడౌన్, స్వాతి డెయిరీ, సాయి ఫిల్లింగ్ స్టేషన్లలో సిబ్బందికి అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అలాగే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రజక మహాసభలను జయప్రదం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రజకులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయా లని కోరుతూ కొండపల్లిలో జరిగే 7వ రాష్ట్ర రజక మహాసభలను జయప్రదం చేయాలని బాపులపాడు మండల రజక సంఘ అధ్యక్షుడు ధర్మవరపు ప్రభుకుమార్ కోరారు. రంగన్నగూడెంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏప్రిల్ 20, 21 తేదీల్లో కొండపల్లి వీటీపీఎస్ గ్రౌండ్‌లో నిర్వహించే ఛలో రజక. ఛలో కొండపల్లి మహాసభలను మన ఐక్యత చాటేలా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారావు, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా అల్లాపురం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

గన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లాపురం పంచాయతీ కార్యదర్శి పి.ఉమామహేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలిచ్చారు. గ్రామంలో పన్నులు వసూళ్ళ, తాగునీటి ట్యాంకులు శుభ్రం, ఇతర సమస్యల పరిష్కారంలో అధికారుల ఆదేశాలను అమలు చేయడంలో విఫలం కావటంతో సస్పెన్షన్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల అల్లాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయటం వివాదస్పదం అయ్యింది. ప్రోటోకాల్‌కు భిన్నంగా వ్యవహరించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లాయి. నేపథ్యంలో సస్పెన్షన్ వేటు పడటంతో గన్నవరంలో చర్చనీయాంశంగా మారింది.

హనుమజ్జయంతి

ఉత్సవ రాట నేడు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అభయాంజనేయ స్వామి ఆలయంలో మే 17 నుంచి 22 వరకు నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆలయం వద్ద ఉత్సవ పందిరి రాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో తారకేశ్వరరావు తెలిపారు. భక్తులు పాల్గొనాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ

ఉయ్యూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కాటూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈ వేస్ట్ సేకరణను ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు శుక్రవారం ప్రారంభించారు. మండల పరిధి గ్రామపంచాయతీలు, ఇతర కార్యాలయాల్లో వృథాగా పడిఉన్న ఈ వేస్ట్‌ను సేకరించి బుద్దవరం తరలించినట్టు ఎంపీడీవో తెలిపారు. కాటూరు సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.


కాటూరులో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

తాడిగడప మునిసిపాలిటీని అభివృద్ధిలో ముందుంచుతాం

• ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్


కానూరులో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే నూతన మునిసిపాలిటీ అయిన తాడిగడప మునిసిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసి ముందు నిలబెడతామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీలోని కానూరు మహదేవపురం కాలనీలో రూ. 40 లక్షలతో మాణిక్యనగర్ నుంచి మెయిన్ రోడ్డు వరకు, రూ. 39 లక్షలతో మాణిక్యనగర్ నుంచి వృద్ధులాశ్రమం వరకు, 35లక్షలతో మిఠాయి షాప్ నుంచి కానూరు పెట్రోల్ బంకు వరకు నిర్మించ తలపెట్టిన డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో పేరుకే మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనుల ఊసే లేకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ధ్వంసమైన రోడ్లు, డ్రెయినేజిలను తిరిగి గాడిలో పెట్టే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర రోడ్లకు వేల మంది ప్రజలు బలయ్యారని, ఎన్నో కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ముందు రోడ్డు ప్రమాదాలు కనిష్టం చేసే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్, టీడీపీ రెహమాన్, తాతపూడి గణేష్, యేనుగు శ్రీనివాస్, సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ గంగాధరరావుకు ఫిర్యాదు వివరాలు అందజేస్తున్న బాధితులు

అసాంఘిక శక్తుల ఆటకట్టించేందుకే పల్లెనిద్ర

జిల్లా ఎస్పీ గంగాధరరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతో అసాంఘికశక్తుల ఆటకట్టించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం చేప ట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. కానుమోలులో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గురు వారం రాత్రి ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. టీడీపీ నాయకుడు చింతల వెంకట శివ అప్పారావు ఆధ్వర్యంలో సర్పంచ్ సీతమ్మ, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. తదనంతరం నిర్వహించిన సభలో ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి రవాణా, రహదారి భద్రతా చర్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఫోర్జరీ సంతకాలతో తమను బెదిరిస్తున్నారంటూ శ్రీనివాసరావు అనే వ్యక్తి కుటుంబంతో సహా ఎస్పీని కలిసి ఫిర్యాదు వివరాలను అందజేశారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు వస్తున్నారని మీరు కూడా సమస్యలను పరిష్కరించేందుకు బిడియం లేకుండా మాట్లాడాలని బిడియపడుతున్న సర్పంచ్ సీతమ్మతో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై సురేష్, నరసింహమూర్తి, చలమలశెట్టి రమేష్ వేగిరెడ్డి పాపారావు, గరికపాటి ఉమ, చిన్నాల గణేష్ దన్నే గాంధీ, పాలకవర్గ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


పెళ్లి వేడుకలో పాల్గొన్న ప్రముఖులు

ఘనంగా వైవీబీ కుమార్తె వివాహం

కంకిపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్, వై. భ్రమరాంబ దంపతుల కుమార్తె స్నేహ వివాహక వేడుక మండల కేంద్రమైన కంకిపాడులోని అయాన కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన అట్లూరి రమేష్, రాధా మాధవి దంపతుల కుమారుడు రాజేష్‌తో స్నేహ వివాహం అట్టహాసంగా జరిగింది. రాత్రి 8.49 గంటల శుభమూహర్తాన వధువు, వరులు ఒక్కటయ్యారు. ఈ వివాహ వేడుకకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బోడె ప్రసాద్, సుజనా చౌదరి, టీడీపీ నాయకులు వర్ల రామయ్య, కొనకళ్ల నారాయణ, గొట్టిపాటి రామకృష్ణ, ఎమ్మెల్సీ వీర్రాజు, బీజేపీ ఎంపీ పురందేశ్వరి, నన్నపనేని రాజకుమారి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఎస్సీ నాయకులు సూదిమళ్ల రవీంద్ర, కొండా ప్రవీణ్

పెనమలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని ఎస్సీ నాయకులు టీడీపీ కంకిపాడు మండల అధ్యక్షుడు సూదిమళ్ల రవీంద్ర, ఉయ్యూరు మార్కెట్ యార్డు చైర్మన్ కొండా ప్రవీణ్‌లు అన్నారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎస్సీల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ఎస్సీ వర్గీకరణతో కూటమి ప్రభుత్వం దళితుల మనసు గెలిచుకుందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలో గతంలో కూడా వర్గీకరణ చేయడం జరిగిందని, దీనివల్ల ఉపకులాలకు చెందిన లక్షలాది మంది వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు పొందారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఎస్సీల పట్ల, వారి నివాసాల పట్ల బాధ్యత తీసుకొని వారి అభివృద్ధికి పాటుబడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటారు. పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ ఉయ్యూరు మహేష్, సీనియర్ నాయకులు నలమోతు మురళి, రాచూరి చిరంజీవి, కొడాలి రవి, పులి విజయ్, కొడాలి శ్రీకాంత్, యుగబాబు, వరుణ్‌కుమార్, మహేష్, కొంద్రు కోటేశ్వరరావు, బలరాం, శీలం నాని, శివ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కరకట్టపై ఇసుక టిప్పరు బోల్తా

వాహనాలు లేకపోవడంతో తప్పిన ప్రమాదం



పెనమలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది కరకట్టపై శుక్రవారం భారీ లోడుతో ప్రయాణిస్తున్న ఇసుక టిప్పరు బోల్తా పడింది. ఆ సమయంలో కరకట్టపై ఏ వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గురువారం పెదపులిపాక ఇసుక రోడ్డుపై ఇసుకలో స్కిడ్ అయి ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఒక మహిళ పాఠశాల వ్యాను కింద పడి మృతి చెందగా వారం కితం ఒకరి వాహనం టిప్పరు చక్రాల కింద పడి నుజ్జయింది. అదేరోజు కరకట్టపై సైక్లింగ్‌కు వెళ్లిన మరోవ్యక్తి టిప్పరు బారి నుంచి తృటిలో తప్పించుకొన్నాడు. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతుండడంతో గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. దీంతో గ్రామస్థులు ఏకమై శుక్రవారం పెదపులిపాక వంతెనకు అడ్డంగా భారీ వాహనాల రాకపోకలు అడ్డుకొనేందుకు గడ్డరు ఏర్పాటు చేయడానికి ప్రయత్నంలో భాగంగా అవసరమైన సామాన్లు కొనుగోలు చేశారు. దీంతో కొద్ది రోజుల్లోనే భారీ వాహనాల రాకపోకలకు చెక్ పడనుంది.

గిన్నిస్ బుక్‌లో చోటు సాధించిన చిన్నారికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభినందన




చిన్మయిను అభినందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్


పెనమలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి సామూహిక నృత్య ప్రదర్శనలో తాడిగడపకు చెందిన ఆరేళ్ల నాగిడి హృదయశ్రీ చిన్మయి సత్తా చాటి గిన్నిస్‌బుక్‌లో చోటు దక్కించుకొంది. 2023లో హైదరాబాద్‌లో 4200 మంది చిన్నారులు 25 నిముషాల పాటు నిరంతరాయంగా నృత్య ప్రదర్శన నిర్వహించగా వారిలో చిన్మయి పాల్గొంది. చిన్నారి హృదయశ్రీకి రెండు రోజుల క్రితం గిన్నిస్ బుక్ సంస్థ నిర్వాహకులు ధ్రువపత్రం అందజేశారు. శుక్రవారం చిన్నారి చిన్మయి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, యువనేత బోడె వెంకట్రామ్‌లను కలవగా వారు చిన్నారిని ఆశీర్వదించి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


పెదఅవుటపల్లిలో ఏసుక్రీస్తు శిలువయాత్ర

ఉంగుటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : లోకరక్షకుడైన ఏసుక్రీస్తు ఈ లోకంలో మానవమాత్రుడిగా జన్మించి సర్వమానవాళి సౌభ్రాతృత్వం, రక్షణకోసం శిలువపై ప్రాణత్యాగం చేశాడని, ఆ మహనీయుడు చూపిన మార్గం, చేసిన బోధనలు అందరికీ అనుసరణీయములని పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ బ్రదర్ జోసఫ్‌తంబి చర్చి ఫాదర్ పాలడుగు జోసఫ్ అన్నారు. గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పెదఅవుటపల్లిలోని బ్రదర్‌జోసఫ్‌తంబి చర్చిలో మతగురువులు పాలడుగు జోసఫ్, గోపు ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. రెవరెండ్ ఫాదర్ పెయిలా ఆంతోని ఆధ్వర్యంలో తేలప్రోలు జోసఫ్‌నగర్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. **గన్నవరం :** సర్వమానవాళి పాప విమోచన కోసం ప్రభువైన యేసు క్రీస్తు శిలువ నెక్కారని కొండపావులూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ తోకల సురేష్ అన్నారు. కొండపావులూరు ఆర్సీఎం చర్చి నుంచి శిలువ మార్గాన్ని ప్రారంభించారు. శిలువ మార్గంలో 7చోట్ల క్రీస్తు చెప్పిన 7 మాటలను వివరించారు. క్రైస్తవ గీతాలను ఆలపించారు. కేసరపల్లి విచారణలో రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్, ముస్తాబాద విచారణ గురువులు జోసఫ్ ఆధ్వర్యంలో శిలువ మార్గాలు చేశారు. **కంకిపాడు :** మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కంకిపాడులోని ఆరోగ్య మాత చర్చి నందు నిర్వహించిన సిలువ మార్గంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసు క్రీస్తు త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ప్రదర్శనలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **ఉయ్యూరు :** మానవుల పాప విముక్తికి యేసుక్రీస్తు చేసిన బలి దానం ప్రేమ, మానవత్వం, ఆధ్యాత్మికతకు సూచిక అని 4వ వార్డు ఆర్సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ మద్దాలి వరప్రసాద్ అన్నారు. గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని 4వ వార్డు ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం శిలువయాత్ర ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ ఫాదర్ అజయ్, 4వ వార్డు కౌన్సిలర్, నగరపంచాయతీ వైస్ చైర్మన్ సోలె సురేశ్, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్, మాజీ ఏఎంసీ చైర్మన్ అబుకలామ్ తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ / రూరల్ :** గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక గుడివాడ రోడ్డులోని జేఎంజే చర్చి ఫాదర్ చేబ్రోలు జోసెఫ్‌తంబీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూజివీడు రోడ్డులోని కారుణ్య చర్చి, హోసన్న మందిరం, విజయవాడ రోడ్డులోని డేనియల్ పాల్ చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెరికీడులోని జెఎంజె చర్చి ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడు కలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శిలువ మార్గం కార్యక్రమాన్ని వీధుల్లో నిర్వహించారు. జెఎంజె సిస్టర్స్, పారిస్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. గుడిసె రాజు, ఏసుపాదం, ప్రదీప్, సాల్మన్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


గన్నవరం మండలం కొండపావులూరు, కంకిపాడు, ఉయ్యూరు, హనుమాన్ జంక్షన్‌లో శిలువయాత్ర


పొణుకుమాడులో బీటీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

ఉంగుటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులన్నీ సీసీ రోడ్లుగా మార్చిన ఘనత గత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందని, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గుంతలమయమైన అంతర్గత రహదారులు, లింక్ రోడ్లను సీసీ రోడ్లు, బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయడంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని పొణుకుమాడులో రూ.75లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు, పెదఅవుటపల్లిలో రూ.80లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు.

తంబి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో యార్లగడ్డ

గుడ్‌ఫ్రైడే సందర్భంగా పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్‌తంబి ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు మతగురువులు పాలడుగు జోసఫ్, గోపు ప్రవీణ్ తదితరులు సాదర స్వాగతం పలికారు. అక్కడ తంబి సమాధిని దర్శించుకున్న యార్లగడ్డ మత గురువులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి ఆళ్ల హనోక్, గ్రామపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు మున్నా రామకృష్ణ, కుందేటి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, కొండేటి కొండలరావు, గుజ్జర్లపూడి బాబూరావు, మేడేపల్లి రమ, పరుచూరి నరేష్, సుంకర రాజేష్, తంబి తదితరులు పాల్గొన్నారు.


సారా అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు

సారా నిషేధానికే నవోదయం 2.0

ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాటు సారా, గంజాయి వంటి దురలవాట్లతో యువత నిర్వీర్యం కాకూడనే ఉద్దేశంతో గ్రామాల్లో నాటుసారా నిషేధమే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమ ఉద్దేశమని విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ సుబ్బారావు అన్నారు. మడిచర్లలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాటుసారా నిర్మూలన, నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా కలిగిఉన్నా, రవాణా చేసినా, తయారు చేసినా చట్టప్రకారం నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సురేఖ, ఎస్సై చందా అల్లూరయ్య, సిబ్బంది, టీడీపీ నాయకులు పుట్టా సురేష్, మోటూరి శ్రీనివాస్, డీసీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా తిరుపతమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కూచిపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మంత్రిపాలెం గ్రామంలో తిరుపతమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రతిష్ఠా మహోత్సవ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

రహదారి అధ్వానం

● నిత్యం ప్రమాదాల బారిన వాహనదారులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : మంటాడ- లంకపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు చోరగుడి, శ్రీరంగపురం గ్రామాల వద్ద గోతులమయంగా తయారై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. దీంతో ఈ రోడ్డుపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. చోరగుడివద్ద రోడ్డుపై పెద్ద గోతులవల్ల ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. శ్రీరంగపురం వద్ద రోడ్డు సగానికి పైగా గోతులతో నిండి ఉంది. విజయవాడ నుంచి వీరంకి లాకు



చోరగుడివద్ద గోతులమయంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు



శ్రీరంగాపురం వద్ద అధ్వానంగా రహదారి

మీదుగా శ్రీకాకుళం వెళ్లే ఆర్టీసీ బస్సులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే సర్కస్‌ఫీట్లు చేయకతప్పడం లేదు. దీంతోపాటుగా రాకపోకల సమయాల్లో బస్సుల పార్టులు కదిలి ఊడి పడిపోతున్నాయని ఆర్టీసీ డ్రైవర్లు భయాందోళనకు గురవుతున్నారు. ఉయ్యూరు నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపైనే ప్రయాణిస్తుంటాయి. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు.

మరమ్మతులు చేపడతాం

మంటాడ- లంకపల్లి రోడ్డులో శ్రీరంగ పురం వద్ద ఏర్పడిన గోతులు పూడ్చేందుకు నిధులు మంజూరయ్యాయి. అక్కడ వారం రోజుల్లో మరమ్మతు పనులు ప్రారంభిస్తాం. చోరగుడి వద్ద గోతులు పూడ్చేందుకు అంచనాలు తయారుచేశాం.

బలరామ్, ఆర్‌అండ్‌బీ డీఈ



సత్తా చాటిన ఫిట్‌జోన్ లిఫ్టర్లు

ఫిట్‌జోన్ లిఫ్టర్లకు పతకాలు

గుడివాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11 నుండి 13వ తేదీవరకు ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వివిధ కేటగిరిల్లో గుడివాడ ఫిట్‌జోన్ లిఫ్టర్లు పతకాలు సాధించినట్టు జిమ్ నిర్వాహకుడు షేక్ సైదా తెలిపారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులోని జిమ్‌లో పతకాలు సాధించిన లిఫ్టర్‌లను ప్రముఖ వైద్యులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేకేఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ : ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు మొహలీలో నిర్వహించిన రెండో అంతర్ ఓపెన్ నేషనల్ స్కేటింగ్ హాకీ పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు ప్రతిభ చాటి జె.స్నిగ్ధ(3వ తరగతి), పి.కారుణ్య(5వ తరగతి)లు తృతీయ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. విద్యార్థులను, కోచ్ అయ్యప్పలను ప్రిన్సిపాల్స్ జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, అభినందించారు.

యువకుడిపై బీర్ బాటిల్‌తో దాడి

గుడివాడ : పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై మరో యువకుడు బీరు బాటిల్‌తో దాడి చేసిన సంఘటన శుక్రవారం ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మచిలీపట్నానికి చెందిన దుర్గాప్రసాద్, విజయవాడ మాచవరానికి చెందిన దుర్గాప్రసాద్ అలియాస్ బ్లేడ్ సాయిల మధ్య పాత గొడవలున్నాయి. శుక్రవారం దుర్గాప్రసాద్ గుడివాడ వచ్చినట్టు విజయవాడకు చెందిన బ్లేడ్ సాయి సమాచారమందింది. పథకం ప్రకారమే స్థానిక ఏలూరురోడ్డులోని ఆహా బార్ వద్ద ఉన్న దుర్గా ప్రసాద్‌పై బీరు బాటిల్‌తో దాడి చేసి, పొడిచి బ్లేడ్ సాయి పరారయ్యాడు. గాయాలపాలైన దుర్గాప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ జన్మదిన వేడుకలు

గుడివాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) :స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ఆయన కేక్ కట్ చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు తన పుట్టిన రోజు సందర్భంగా రెండు వాటర్ ట్యాంకర్‌లను మున్సిపాలిటీకి బూరగడ్డ ఏర్పాటు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, జనసేన జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వాసు, మార్కెట్ యార్డు ఛైర్మన్ గరికిపాటి శివశంకర్, పామర్రు ఇన్‌చార్జ్ నరేష్, కాపు సేవా సమితి నాయకులు రామకృష్ణలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



కేక్‌ను కట్ చేస్తున్న జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ : రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి పుట్టినరోజు సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా, నూజివీడుకు చెందిన యాదవ సంఘం రాష్ట్ర నాయకులు తలపంటి రాజశేఖర్ వితరణతో శుక్రవారం స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీసీఎస్ సీఐ రమణమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, సభ్యులు మునీంద్ర, రామారావు, హరిబాబు పాల్గొన్నారు.

సాయిమందిరంలో చోరీ నిందితుడి అరెస్ట్

గుడివాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దొండపాడు కాలనీ శ్రీదేవి నగర్ సాయిబాబా మందిరంలో ఏప్రిల్ 14న శ్రీకాళహస్తి కాలనీకి చెందిన పప్పుల ప్రభు కుమార్ అనే యువకుడు రెండు లక్షల విలువైన కిలోన్నర వెండి వస్తువులు దొంగించాడు. కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు గుడివాడ సబ్ డివిజన్ పోలీసు అధికారి పర్యవేక్షణలో రూరల్ సీఐ ఎస్ఎల్ఆర్.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో గుడివాడ రూరల్ ఎస్సై ఎన్.చంటిబాబు దర్యాప్తు ప్రారంభించారు. సేకరించిన సాంకేతిక ఆధారాలు ఇతర సాక్ష్యాల ఆధారంగా ఎంతో చాకచక్యంగా వ్యవహరించి శుక్రవారం ఉదయం 11 గంటలకు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ 14వ తేదీ చోరీ జరుగగా, ఈ రోజు నిందితుడిని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి కేజీ వెండి శఠగోపం, 1 వెండి కిరీటం, బాబా వెండి పాదుకలు రెండు, డిజైన్ గల వెండి పళ్లెం 1, చిన్న వెండి పళ్లెం 1, మొత్తం రూ.1.50 లక్షలు విలువ ఉంటుందని తెలిపారు. 13 రకాల వెండి పాత్రలతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చెందిన సుమారు రూ.50 వేలు విలువ చేసి 20 కిలోల రాగి వైరును నిందితుడు వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం డీఎస్పీ చేతులమీదుగా ఎస్సై ఎన్.చంటిబాబు, సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో సీఐ సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్



విద్యార్థులకు వివరిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు



మొవ్వలో కరపత్రాలు అందిస్తున్న అగ్నిమాపక అధికారులు

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

గుడివాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో శుక్రవారం ఐదో రోజు రావి ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్, అయ్యప్ప గ్యాస్ ఏజెన్సీస్‌లో అగ్నిప్రమాద నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలను ఎలా నియంత్రించాలో క్షేత్రస్థాయిలో చేసి చూపించారు. ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తప్పించుకునే మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఏడీవో ఆంజనేయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడి : అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఐదవ రోజైన శుక్రవారం మొవ్వ, కోసూరు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలు, మంటలు ఆర్పే పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యం

నందివాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలం సందర్భంగా కాలువల ద్వారా వచ్చే తాగునీరు శివారు గ్రామాల మంచినీటి చెరువులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు, మూడు రోజులలో కాలువల ద్వారా తాగునీరు వస్తున్న సందర్భంగా ఇరిగేషన్ అధికారులు కాలువల గండ్లు పూడ్చి చేపల చెరువులకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా చేపల చెరువుల యజమానులు కాలువల ద్వారా నీళ్లు వచ్చే సమయంలో చేపల పట్టుబడులు అంటూ ఏ ఒక్క రైతు చెరువుల తూములు తీసి కాలువలలోకి వదలకూడదన్నారు. అలా చేసిన వారిపై సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా నీటి సంఘం నాయకులు కాలువ వెంట నీళ్లు వచ్చు సమయంలో కాలువల ద్వారా తిరుగుతూ ప్రతి గ్రామంలో మంచినీటి చెరువులు నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వేసవిలో తాగునీటి సమస్యలు ఎక్కువవుతాయన్నారు. గ్రామాల్లోని పంచాయతీ అధికారులు మంచినీటి చెరువులు నింపేందుకు ముందుగానే చర్యలు చేపట్టాలన్నారు. వేసవి కాలం ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతి ఒక్క అధికారి ముందుగానే తగు చర్యలు తీసుకోవాలన్నారు.



సన్యాసిరావు

కృష్ణా ఆర్ట్స్ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు ప్రారంభం

గుడివాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటిక పోటీలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. తొలుత బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. పోటీల మొదటి రోజు మొదటి నాటికగా హేలాపురి ఆర్ట్స్, ఏలూరు వారిచే "సారీ రాంగ్ నెంబరు" నాటికను ప్రదర్శించారు.నేటి కాలంలో కొడుకును కాపాడుకోవడానికి ఒక తండ్రి పడిన ఆరాటం, భర్తను కాపాడుకోవడానికి ఒక ఇల్లాలు చేసిన పోరాటాన్ని నటీనటులు కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రేక్షకులు నాటిక ఆసాంతం తిలకించి కన్నీటి పర్యాంతమయ్యారు



సమావేశంలో మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు

నేడు విద్యుత్‌కు అంతరాయం

గుడివాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో విద్యుత్ లైన్లు మరమ్మత్తులు కారణంగా ఈ నెల 19వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పమిడిముక్కల : సబ్‌స్టేషన్ల నిర్వహణ, విద్యుత్‌లైన్లకు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 9 గంటలవరకు పమిడిముక్కల మండల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి గోవిందరావు తెలిపారు.

రైలు బండి ఢీకొని ఒకరి మృతి

గుడివాడ : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ మహబూబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌతవరం-పెడన రైల్వే స్టేషన్‌ల మధ్యలో సుమారు 40 ఏళ్ల వ్యక్తి రైలుబండి ఢీకొని మృతి చెందాడన్నారు. మృతుని ఒంటిపై తెలుపు రంగు లాల్చీ, తెలుపు రంగు పైజమా ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిసినవారు సెల్ నెంబర్లు 94406 27570, 98495 96079కు సమాచారమందించాలని ఎస్సై కోరారు.

ఐఎంఏ అధ్యక్ష,కార్యదర్శుల ఎన్నిక

గుడివాడ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడశాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ మాగంటి శ్రీనివాస్, డాక్టర్ పునుకొల్లు శ్రీనివాస్‌లు ఎన్నికైనట్టు ప్రస్తుత అధ్యక్షులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు తెలిపారు. గురువారం రాత్రి సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్లో నిర్వహించిన సమావేశంలో 2025-26 సంవత్సరానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా డాక్టర్ దేవరపల్లి సూరజ్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఉండవల్లి సురేష్‌బాబు, ఉప కార్యదర్శిగా డాక్టర్ యమ్.సుందరయ్యలు ఎన్నికయ్యారు.

ఉనికి కోసమే మాజీ మంత్రి పేర్ని ఆరాటం

గుడివాడ : మైనార్టీల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు మాజీ మంత్రి పేర్ని నాని ఆరాటపడుతున్నారని, కేవలం ఉనికి కోసమే పేర్ని గుడివాడ వచ్చి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ ఇబ్రహీం, సయ్యద్ జబీన్, షేక్ జానీ, మహ్మద్ రఫీలు ఆరోపించారు. శుక్రవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



గుడివాడలో..

గుడివాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులకు అత్యంత పవిత్ర దినమైన గుడ్‌ఫ్రైడేను పట్టణంలో క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మౌంట్ కర్మెల్ ఆర్సీఎం చర్చి ఫాదర్ గుజ్జుల మైకేల్, జాన్‌హరీష్, కోతిబొమ్మ సెంటర్‌లోని అవిలాపూరి చిన్న తేరేజమ్మ ఆర్సీఎం -2 దేవాలయాల్లో ఫాదర్ లూయిస్‌లు ప్రార్థనలు నిర్వహించారు.

కూచిపూడి : గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని కూచిపూడి ఆర్సీఎం చర్చి నుంచి పాస్టర్ జాకబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో కూచిపూడి సెంటర్ వరకు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొని సిలువ యాత్ర నిర్వహించారు. ప్రేమ, విశ్వాసం, క్షమాగుణాలు ప్రతీ ఒక్కరూ కలిగి ఉండాలని మత పెద్దలు పేర్కొన్నారు.

నందివాడ : క్రైస్తవులకు ముఖ్యమైన రోజులలో గుడ్‌ఫ్రైడే ఒకటని పోలుకొండ ఆర్సీఎం చర్చి ఫాదర్ అనిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు 41 రోజులు మాల ధరించి భక్తిశ్రద్ధలతో ఎంతో నిష్టగా ఉంటూ గుడ్ ఫ్రైడే రోజున గ్రామాలలో సిలువ మార్గమును నిర్వహిస్తూ వివిధ వేషధారణలతో పురవీధులలో తిరుగుతారన్నారు. మండలంలోని నందివాడ, జనార్థనపురం, పెదలింగాల, తుమ్మలపల్లి, కుదరవల్లి, ఇలపర్రు, పోలుకొండ, రుద్రపాక, అనుమనపూడి, తమిరిశ, వెన్ననపూడి, విరివాడ గ్రామాల్లో శుక్రవారం సిలువ మార్గ కార్యక్రమాలు నిర్వహించారు.

పామర్రు : పామర్రులోని ఆర్సీఎం చర్చి ఫాదర్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో శుక్రవారం పురవీధుల్లో గుడ్ ఫ్రైడే ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు. భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. మండల పరిధిలోని అడ్డాడ, కొండాయపాలెం, జువ్వనపూడిగూడెం, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి తదితర గ్రామాల్లో యేసు ప్రార్థనా మందిరాలు విశ్వాసులతో కిటకిటలాడాయి. సర్వమానవాళి పాపాలను విమోచించడానికి శిలువలో క్రీస్తు మరణించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



నందివాడలో..

పెదపారుపూడి : యలమర్రు, వెంట్రప్రగడ, దోసపాడు, చినపారుపూడి, పెదపారుపూడి గ్రామాల్లో రక్షణ సైన్యం దేవాలయంలో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేజర్ వి.విజయ్ కుమార్, మేజర్ రూత్ కుమారి క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు దగాని జోసఫ్, నత్తా భూషణ్ కుమార్, గూడపాటి భాస్కరరావు, గృహ సమితి సభ్యులు పీతా పద్మ, గుమ్మడి యేసు మరియమ్మ, దగాని గ్రేస్, సంఘస్థులు పాల్గొన్నారు.



కూచిపూడిలో..

పమిడిముక్కల : గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని పమిడిముక్కల మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం శిలువయాత్ర ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ రాజారత్నం ఆధ్వర్యంలో శిలువయాత్ర నిర్వహించారు. ప్రపంచానికి శాంతి సందేశాన్నిస్తూ యేసుక్రీస్తు చేసిన మహా త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అన్నారు. పవిత్ర శుభ శుక్రవారం అందరికి శుభం కలగాలని ఆకాంక్షించారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులోని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే(శుభ శుక్రవారం) వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రతి చర్చిలో క్రైస్తవులు మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపవాసాలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దేవరపల్లిలో సీబీసీఎన్‌సీ చర్చి పాస్టర్ రెవ. పి రాజారత్నం గ్రామంలోని ప్రధానవీధుల్లో శిలువను మోయగా భక్తులు ఆయన వెంట పాటలు పాడుతూ యాత్ర నిర్వహించారు.



పామర్రులో..



తోట్లవల్లూరులో..



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

గోగినేనిపాలెం శివారులో పవన్ మృతదేహం



ఘంటసాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కేఈబీ కెనాల్‌లో గురువారం సాయంత్రం గల్లంతైన పాపవినాశనం గ్రామానికి చెందిన విద్యార్థి పత్తిపాటి పవన్ (15) మృతదేహం శుక్రవారం ఉదయం గోగినేనిపాలెం శివారులో తేలింది. పవన్ మృతదేహం వద్ద తల్లి, కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కలచి వేసింది. ఘంటసాల ఎస్సై ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు. పవన్ మృతితో పాపవినాశనం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మచిలీపట్నంలో జరిగిన శిలువ యాత్రలో జనసేన నేత బండి రామకృష్ణ



అవనిగడ్డలో శిలువ యాత్ర



నాగాయలంకలో శిలువ యాత్ర

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే.. శిలువ యాత్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మానవాళి రక్షణకు ఏసుక్రీస్తు శిలువ మార్గంలో ప్రాణం అర్పించారని ఆర్సీఎం ఫాదర్ ఎన్ డేవిడ్ రాజు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా మచిలీపట్నంలోని ప్రధాన చర్చిల వద్ద క్రైస్తవులు శాంతి యాత్ర చేశారు. ఆర్సీయం చర్చి నుంచి ప్రారంభమైన భారీ శిలువ యాత్ర కోనేరుసెంటర్, రాజా సెంటర్‌ల మీదుగా మళ్లీ ఆర్సీయం చర్చికి చేరుకుంది. నిర్మలా కాన్వెంట్ నన్స్, ఉపాధ్యాయులు, సహాయ గురువు కిషోర్ పాల్గొన్నారు. ఎల్ఈఎఫ్ చర్చి వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఫాదర్ ప్రభాకరరావు సందేశం ఇచ్చారు. శారదానగర్‌లోని చర్చిలో సాగరమాత విచారణ గురువు ఫాదర్ జానిడి క్రూస్ దివ్య సందేశం ఇచ్చారు. నగరవీధుల్లో శిలువ మార్గాన్ని నిర్వహించారు. చిన్నాపురం, వాడపాలెం, సింహాచలం, రుద్రవరం తదితర ప్రాంతాల క్రైస్తవులు పాల్గొన్నారు. వివిధ చర్చిల వద్ద సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమాలు జరిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణతో పాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. **పెడన :** తోటమూలలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గం నిర్వహించారు. విశ్వాసులు ఫాదర్ జోసఫ్ పర్యవేక్షణలో చర్చి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఏసుక్రీస్తు వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫాదర్ జోసఫ్ మాట్లాడుతూ, ఏసుక్రీస్తు బోధనలు మానవ జీవనానికి మార్గదర్శకాలన్నారు. శిలువపై అంతటి బాధలోనూ ఏసుక్రీస్తు క్షమాగుణాన్ని వీడలేదన్నారు. **కోడూరు :** కోడూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సిహెచ్. ప్రశాంత్ ఆధ్వర్యంలో క్రీస్తు శిలువను మోస్తూ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు. **నాగాయలంక :** ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ఫాదర్ సిహెచ్.జాన్‌బాబు శిలువ మోస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. పవిత్ర శుక్రవారం సందేశాన్ని ఆయన ఇచ్చారు. ఊరేగింపులో 12 గ్రామాల విశ్వాసులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. బ్రదర్ మణిహర్, తానంకి జాన్సన్, వేణుబాబు, బడుగు దుర్గారావు, డాక్టర్ బాబు, ప్రభుదాసు, చాట్రగడ్డ ప్రభాకర్ తదితరులు పర్యవేక్షించారు. **మోపిదేవి :** గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలో జరుపుకున్నారు. క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహిస్తూ శాంతి ర్యాలీలు నిర్వహించారు. **ఘంటసాల :** ఆర్‌సీఎం, సీఎస్ఐ, పెంతెకొస్తు దేవాలయాల వద్ద ఉదయం 9 గంటల నుంచి ప్రార్థనలు చేశారు. శిలువ మార్గం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ఎల్ఈఎఫ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



శారదానగర్‌లో శిలువ యాత్ర



పెడనలో..

సర్వమానవాళి పాపాలు హరించటానికి ఏసు క్రీస్తు శిలువపై మరణించారని దైవ సేవకులు తెలిపారు. సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డలోని అన్ని ప్రార్థనా మందిరాల్లో ఏసుక్రీస్తును స్మరించుకుంటూ శిలువ మార్గాన్ని చేపట్టారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన శిలువ యాత్ర నిర్వహించారు. వందలాది మంది విశ్వాసులు యాత్రలో పాల్గొని ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు. శిలువ మార్గంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు తదితరులు శిలువను మోసి క్రైస్తవులకు సంఘీభావం తెలిపారు. **చల్లపల్లి :** లక్ష్మీపురం శివారు సాలిపేట ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శుభ శుక్రవారం సందర్భంగా 12 గ్రామాల ఉపదేశికులు, విశ్వాసులు వందలాది మంది శిలువ మార్గం అనుసరించి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ బి.రవికుమార్ ఆధ్వర్యంలో క్రీస్తు శాంతి సందేశాన్ని అందజేశారు. కోమలానగర్ సమీపంలోని మదర్ థెరిస్సా స్కూల్ నుంచి వందలాది మంది విశ్వాసులు శిలువ మార్గంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఆంధ్రా గోమ్స్ విశ్వాసులకు అల్పాహారం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి తోట బెర్నార్డ్‌షా విశ్వాసులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరియదళ సభ్యులు ప్రార్థనా గీతాలు ఆలపించారు.



చల్లపల్లిలో శిలువ మోస్తున్న ఆర్సీఎం చర్చి ఫాదర్ బి.రవికుమార్



కోడూరు ప్రధాన సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



బాలోత్సవ్ నిర్వహించిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి

బాలోత్సవ్ నిర్వహణ అభినందనీయం


అవనిగడ్డ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యా కుటుంబం బాలోత్సవ్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు.ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం బాలోత్సవ్ కార్యక్రమానికి విచ్చేసిన మండలానికి చెందిన 42 మంది ఉపాధ్యాయులు, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించారు. కోడూరులో నిర్వహించిన బాలోత్సవ్ స్ఫూర్తితో నియోజకవర్గ స్థాయి బాలోత్సవ్ నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు

మహోన్నత సేవామూర్తి మణిప్రభాకరరావు

చల్లపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మహోన్నత సేవామూర్తి మణిప్రభాకరరావు మాస్టారు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వక్కలగడ్డ గ్రామంలో ఇటీవల మృతి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు మాస్టారి చిత్రపటానికి ఆయన శుక్రవారం నివాళులర్పించారు. మణిప్రభాకరరావు సమాజంలోని నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి ఫీజులు చెల్లిస్తూ ప్రోత్సహించి ఉన్నతస్థాయికి చేరుకునేలా సహకారం అందించటం స్ఫూర్తిదాయకమన్నారు.దాదాపు 150 మంది విద్యార్థులు మణిప్రభాకరరావు సహకారంతో ఉత్తమ విద్యావంతులుగా ఎదగటం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. సీపీఐ నేతలు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మల్లుపెద్ది అజయ్‌బాబు, టీడీపీ నేత పరిశె మౌళి, విశ్రాంత ఈవో ఆర్డీ సీతారామరాజు, మాస్టారి బంధుమిత్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన కనకదుర్గ

ఘంటసాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్‌ను ఘంటసాల ఏఎంసీ ఛైర్‌పర్సన్ తోట కనకదుర్గ, పాలకవర్గ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, రైతాంగ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు రైతుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ హరిప్రసాద్ సూచించినట్లు కనకదుర్గ తెలిపారు. ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు అంకాని మహేంద్ర, జనసేన మండల పార్టీ అధ్యక్షులు కోన రాజశేఖర్, కోల్లపల్లి శ్రీవర్ష, కోమరగిరి నాగినిలు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కనకదుర్గ



తులసీరావుకు టీడీపీ నాయకుల సత్కారం

కృత్తివెన్ను, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మల్లేశ్వరం మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమితులైన ఒడుగు తులసీరావును శుక్రవారం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. తులసీరావు సేవలను పార్టీ గుర్తించి తగిన పదవి కట్టబెట్టడం పార్టీ శ్రేణులకు సంతోషాన్నిచ్చిందన్నారు. తులసీరావుకు తగిన గుర్తింపునిచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తులసీరావును దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. డీసీ ఛైర్మన్ నెక్కంటి భాస్కరరావు, కూనసాని చిన్నా, చిలుకూరి చంద్రశేఖర్, కూనసాని శ్రీనివాసరావు, చేకూరి వెంకట్రావు, అధికారి అప్పి, వలవల తాతాజీ, నడకుదుటి ఆంజనేయులు, కూనసాని అక్లక్, పిన్నెంటి రాం బాబు, మాటూరి పెదబాబు తదిరులు పాల్గొన్నారు

మత్స్యకార భరోసా లబ్దిదారుల ఎంపికకు ఎన్యుమరేషన్

నాగాయలంక : వేట నిషేధిత కాలంలో మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు నగదును జమ చేసేందుకు నాగాయలంక పడవల ల్యాండింగ్ సెంటర్‌లో శుక్రవాకం మత్స్యశాఖ సిబ్బంది పడవల ఎన్యుమరేషన్ జరిపారు. మత్స్యశాఖ అసిస్టెంట్ ఎం.జగదీష్, రమ్య దీప్తి, సుధాకర్, మురళీ జాలరుల ఐడీ కార్డులు, బ్యాంక్ ఖాతా పుస్తకాలను పరిశీలించి పడవలను నమోదు చేశారు. కంకిపాడు మత్స్యశాఖ అధికారి, పరిశీలనాధికారి పి.అఖిల పర్యవేక్షించగా, మత్స్యకార సంఘం నేతలు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** మండల పరిధిలోని 47 బోట్లను ఎన్యూమరేషన్ చేసినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ దాసరి విజయ కుమార్, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, అఖిల పాల్గొన్నారు.

కుళాయి నుంచి బిందె నీరు రావట్లేదు

• మోపిదేవిలో తాగునీటి ఇక్కట్లు • మహిళల ఆగ్రహం

మోపిదేవి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మోపిదేవిలో మంచినీటి సమస్యతో గ్రామస్థులు అల్లాడుతున్నారు. మోపిదేవి ప్రధాన గ్రామంలో రక్షిత మంచి నీటి పథకం ఉన్నప్పటికీ గడిచిన కొద్ది రోజులుగా ఒక బిందె నీరు కూడా కుళాయిల ద్వారా రావటం లేదంటూ గ్రామస్థులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కాలువకు నీరు ఉన్న రోజుల్లో రెండు మూడు బిందెల వరకు నీళ్ల వస్తాయని, ప్రస్తుతం ఒక్క బిందె కూడా నీరు రాకుండానే కుళాయిలు ఆగిపోతున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీ దృష్టికి అనేక పర్యాయాలు నీటి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తాగేందుకు రక్షిత మంచినీరు చుక్క కూడా అందటం లేదని, కిలోమీటర్ల దూరం వెళ్లి పొలాల వద్ద ఉన్న చేతి పంపుల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గౌడపాలెం, గొల్లపాలెం, అవనిగడ్డ వెళ్లే రహదారి వెంబడి పాత కరకట్ట కాలనీల్లో అరకొరగా అరబిందె వరకు నీరు వస్తుందని, ఇదేమిటని పంచాయతీ వారిని అడిగితే కరెంట్ సక్రమంగా ఉండటం లేదు, నీరు అందటం లేదని సాకులు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకుని తాగేందుకు బిందెడు నీళ్ల అయినా కుళాయిల ద్వారా వచ్చేలా చూడాల్సిందిగా పంచాయతీ అధికారులను కోరుతున్నారు.



నీటి కోసం బిందెలతో కుళాయి వద్ద ఎదురుచూస్తున్న మహిళలు

విద్యుత్ మోటార్లతో తోడేస్తున్నారు

అనుమతులు లేకుండా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటిని వదిలిన సమయంలో తోడేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్రమ మోటార్ల విషయమై గ్రామసభల్లో గ్రామస్థులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని, ఆ కారణంగానే సామాన్య ప్రజలకు రక్షిత మంచి నీరు అందటం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కుళాయిలకు ఏర్పాటు చేసిన అక్రమ మోటార్లు తొలగించి పంచాయతీ ప్రజలక నీళ్ల ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కళాకారులను సన్మానిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రతినిధులు, నేతలు

కళాకారులను ప్రోత్సహించాలి

ఎన్టీఆర్ కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని

చల్లపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కళాకారులను గౌరవించి ప్రోత్సహించటం అందరి బాధ్యత అని ఎన్టీఆర్ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని అన్నారు. ఎన్టీఆర్ పార్కులో కళాకారుల సౌకర్యార్థం కళాపరిషత్ అధ్యక్షుడు బోలెం రామారావు - నాగమణి దంపతులు సుమారు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన మేకప్ రూమ్‌ను ఉపసర్పంచ్ ముమ్మనేని నాని - మల్లీశ్వరి , నర్రా సాయి బాబు, ఆకుల స్వభూప్రసాద్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు, పౌరాణికమేటి పుప్పాల వీరాంజనేయులు, బంగారు నంది అవార్డులు స్వీకరించిన వారికి ముమ్మనేని నాని ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. పురప్రముఖులు రామారావును సత్కరించి అభినందనలు తెలిపారు. రంగస్థల కళాకారులు బెల్లంకొండ ఏడుకొండలు, వేముల సూరిబాబు, రాజులపాటి వీరాచారి, సుబ్బయ్య, మల్లంపల్లి రాంబాబు, హార్మోనిస్ట్,వయోలనిస్టులు డి.రమేష్, శర్మ, శ్రీరాం పూర్ణచంద్రరావు, సత్యనారాయణ, నారేపాలెం వేణు, కోలాటం గురువు వేముల అంకంబొట్లు, డప్పు కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసుడు తదితర కళాకారులను పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, ప్రముఖులు అడ్డాడ ప్రసాద్‌బాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, దాసి సీతారామరాజు, పి.వి.మాధవేంద్రరావు, మీర్ రిజ్వాన్, కైతేపల్లి దాస్, ఉప్పల సాంబశివరావు, పరిశె మౌళి, బుల్లా కిషోర్, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, కస్తూరి ప్రసాద్, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, బత్తుల ప్రసాద్, రావులపల్లి పండు, శంకరరావు, పోతుమర్తి నాగమణి పాల్గొన్నారు. కళాప్రదర్శనలు జరిగాయి.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం జ్యూయలరీ పార్కు అసోసియేషన్ హాలులో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వైద్యులు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వీరేంద్రనాథ్, శివప్రసాద్ సాయిప్రసాద్, వాణికుసుమ, రావి శ్రీనివాసరావు, తదితరులు 283 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకరనాథ్, కోశాధికారి కొండపల్లి రామ్‌బాలాజీ, స్టేట్ మెంబర్ గుండు రమేష్, జ్యూయలరీ పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దేటి సుబ్బారావు, కార్యదర్శి జితేంద్ర, చలమలశెట్టి మాధవి, తాతా లక్ష్మీదుర్గ, కృష్ణతేజ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూదాలపై డీఎస్పీ ఉక్కుపాదం.. క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టు

చల్లపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ జూదాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. డ్రోన్ కెమెరాలతో పేకాటరాయుళ్లను కట్టడి చేస్తున్నారు. పేకాట, సింగిల్ నెంబర్ లాటరీతో పాటు క్రికెట్ బెట్టింగులపైనా డీఎస్పీ దృష్టి సారించారు. చల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఏడుగురిని శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్లు సీజ్ చేసి రూ.10,200 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో వేళ్లూనుకున్న సింగిల్ నెంబర్ జూదాన్ని ఉన్నతాధి కారుల కఠిన నిర్ణయాలతో దశాబ్దం క్రితం కట్టడి చేశారు. గత ఏడాదిలో ఎన్నికల ముందు మళ్లీ ప్రారంభం కాగా, అడపా దడపా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ యథేచ్ఛగా కొనసాగుతోంది. డీఎస్పీ టి.విద్యశ్రీ తనదైన ముద్ర వేస్తూ జూదాలను అరికట్టేందుకు, కఠిన చర్యలు తీసు కునేందుకు కార్యాచరణలోకి దిగారు. గ్రామ గ్రామానా బుకీలు ఉండటంతో ఏమేరకు అదుపు చేస్తారో, ఎంతమందిని అదుపులోకి తీసుకుంటారో వేచి చూడాలి. రెండు గ్రూపులుగా జరుగుతున్న జూదాన్ని అరికట్టేందుకు నిర్వాహకులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టినట్లు సమాచారం.